ఆరోగ్యం ఉంటేనే ఆనందం

- రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వం వైద్య సేవలు అందిస్తోంది
- దేశంలో ఎప్పుడూ జరగని విధంగా జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య పరీక్షలు
- ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ


దుగ్గిరాల మండలం గొడవర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి

తాడేపల్లిరూరల్ : ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం సుఖ సంతోషాలతో జీవిస్తుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు సేవలందిస్తున్నారు. దుగ్గిరాల మండల వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహిస్తున్నారని ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గొడవర్రులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి వార్డు ప్రజలకు ఒక్క రూపాయి ఖర్చు కాకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారని, మన దేశంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రంలో కూడా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు సేవలు అందించలేదని, మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఇంటింటికి వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసి నిపుణులైన వైద్యులచే పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయడం, ఎవరికైనా శస్త్రచికిత్స అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా వారికి శస్త్రచికిత్సలు చేస్తున్నారని అన్నారు. గ్రామంలో విద్యార్థులు, వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లను అందజేస్తున్నారు. మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన వస్తోందని, ఎంతోకాలంగా వివిధ సమస్యలతో బాధపడుతున్న మహిళలు వైద్యం చేయించుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఈమని ప్రభుత్వ వైద్యులు డాక్టర్ సుకన్య, ఆర్థోపెడిక్ డాక్టర్ శ్రావణ్ కుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ శ్వేత, డాక్టర్ వి.కర్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, ఎంపీటీసీ కొండూరు సుమన్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నులిపురుగుల నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి



ఫిరంగిపురం: తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారానే నులిపురుగుల నివారణ సాధ్యపడుతుందని ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాం జిల్లా అధికారి ఎ.శ్రావణ్‌బాబు అన్నారు. మండలంలోని నుదురుపాడు, ఫిరంగిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని 9న పాఠశాలల్లో విద్యార్థులకు, చిన్నారులకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. ప్రతిరోజు ఆరోగ్య సిబ్బంది ప్రజలకు, పాఠశాలల్లో విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పించాలని చెప్పారు. వారిచే ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల వైద్యులు, ఫరీనాబేగం, యానీగ్రేస్, ఎస్తేరు రాణి, శ్వేత, సిబ్బంది పాల్గొన్నారు.

దుగ్గిరాల తహసీల్దార్‌గా రవిబాబు



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల నూతన తహసీల్దార్‌గా కె.రవిబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దుగ్గిరాల తహసీల్దార్‌గా పనిచేసిన కె.మల్లేశ్వరి బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీ కాగా ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం నుంచి బదిలీపై రవిబాబు ఇక్కడకు వచ్చారు. రెవెన్యూ అధికారులు ఘన స్వాగతం పలికారు.

మేడికొండూరు తహసీల్దారుగా రాజ్యలక్ష్మి



మేడికొండూరు: మండల తహసీల్దారుగా క్రోసూరి రాజ్యలక్ష్మి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో తహసీల్దారుల బదిలీల్లో భాగంగా నెల్లూరు నుంచి మేడికొండూరు వచ్చారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి నేరుగా తనను సంప్రదించాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియలో తప్పుడు తడకలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ కార్యక్రమం



మేడికొండూరు: ప్రణాళికా బద్ధంగా విద్యార్థులు చదివి ఉన్నత స్థాయికి ఎదిగేందుకు లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని ఎస్సై డేవిడ్ రాజు తెలిపారు. మేడికొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎస్సై డేవిడ్‌రాజు మాట్లాడుతూ ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలంటే పుస్తక పఠనం చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయప్రద, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద పరిశీలన

ప్రత్తిపాడు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ప్రభుత్వం అందిస్తుందని ప్రత్తిపాడు ఉపసర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరును, రాగిజావ నాణ్యతను పరిశీలించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఓంప్రకాష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జాన్‌పీరా తదితరులున్నారు.

సంక్షేమ పథకాల స్వరాజ్యం.. జగనన్న రాజ్యం

గుడ్ మార్నింగ్ మంగళగిరిలో సమన్వయకర్త గంజి చిరంజీవి


రత్నాలచెరువులో సమస్యలు తెలుసుకుంటున్న గంజి చిరంజీవి

మంగళగిరి: సంక్షేమ పథకాల స్వరాజ్యం.. జగనన్న రాజ్యం అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి పేర్కొన్నారు. మంగళగిరి పట్టణంలోని 21వ వార్డు రత్నాలచెరువులో గుడ్ మార్నింగ్ మంగళగిరి కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి గత ప్రభుత్వాలకు జగనన్న ప్రభుత్వానికి ఉన్న తేడా వివరించడంతో పాటు ప్రస్తుతం ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను తెలియజేసి రానున్న ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు విద్య, వైద్యం అత్యంత ఖర్చుతో కూడుకున్నవని ఆ రెంటిని పేదలకు ఉచితంగా అందించినప్పుడే పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో సమాజం అభివృద్ధి చెందుతుందని భావించిన నాయకుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. విద్య, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి పేదలకు అండగా నిలిచారన్నారు. సంక్షేమ పథకాల అమలులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని, రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగన్‌ని రానున్న ఎన్నికలలో మరలా ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, కురగంటి ఆదామ్, బేతపూడి నరసయ్య, కొల్లి శేషిరెడ్డి, తోట శ్రీనివాసరావు, రాజేష్, వందనం, దేవళ్ల సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా డ్రైవర్స్ డే వేడుకలు



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట సీఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో మంగళవారం రాష్ట్రీయ ఏక్తా మంచ్ ఆధ్వర్యంలో డ్రైవర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రీయ చాలక్ ఏక్తా మంచ్ జనరల్ సెక్రటరీ లాల్ బాషా ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధులైన నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు డ్రైవర్‌గా పనిచేసిన కల్నల్ నిజాముద్దీన్ తన శరీరంలో మూడు బుల్లెట్లు దిగినా ఏ మాత్రం వెనుకంజ వేయకుండా వృత్తి ధర్మం పాటించారని, ఆయన వీరమరణం పొందిన ఫిబ్రవరి 6న ప్రతి ఒక్క డ్రైవర్ ఆయన్ను స్మరించుకోవాలని అన్నారు. యూనియన్ నాయకులు నాగేంద్ర మాట్లాడుతూ డ్రైవర్ వృత్తి ఎంతో గొప్పదని, డ్రైవర్ లేనిదే బండి నడవదని అన్నారు. ప్రభుత్వం డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అన్ని విధాలా అండగా నిలిచి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ పనుల పరిశీలన


పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాకలో రూ.20 లక్షల వ్యయంతో కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసే కార్యక్రమం కార్పొరేషన్ అధికారులు మంగళవారం చేపట్టారు. గత కొంత కాలంగా కొత్తూరు వాటర్ ట్యాంక్ నుంచి నివాసాలకు తాగునీటిని సరఫరా చేసే పైపులైన్లు తుప్పు పట్టి సరిగా తాగునీరు అందకపోవడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా రూ.20 లక్షలు మంజూరు చేసి పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పెనుమాక అధ్యక్షులు దామేష్‌రెడ్డి మాట్లాడుతూ పెనుమాకలోని కొత్తూరు వాటర్ ట్యాంక్ వద్ద ప్రధాన పైపులైన్ ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించడం వల్ల తాగునీటి సరిఫరా సరిగా జరగడం లేదని, కెనరాబ్యాంక్, హిందూ శ్మశాన వాటిక ప్రాంతాల్లో కూడా తాగునీటి సరిఫరా అందకపోవడంతో ఈ పనులను ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రేవతి, అనూష, వైఎస్సార్‌సీపీ నాయకులు బొక్కా ప్రసన్న నాని, పులి భుజంగరావు, సుభాని తదితరులు పాల్గొన్నారు.

'కళ్లం' అధ్యాపకురాలికి డాక్టరేట్



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి అధ్యాపకుని లక్ష్య సాధనకు తమ కళాశాల ఎల్లవుడూ వెన్నంటే ఉంటుందని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న కె.భాగ్యశ్వేతలతకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. ఫ్లూయిడ్ మెకానిక్స్ హీట్ ట్రాన్స్‌ఫర్ ఎన్‌హెన్స్‌మెంట్ అనాలసిస్ ఆన్ థర్మల్ రేడియేటివ్ ఫ్లో ఆఫ్ హైబ్రిడ్, టెర్నరీ నానో ఫ్లూయిడ్స్ అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకురాలిని ఎన్‌యూ పీహెచ్‌డీ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జ్ఞానేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు అభినందించారు.

చిన్నారులకు ఆటల పోటీలు

నగరంపాలెం: జిల్లాలోని బాల బాలికలు కలిసికట్టుగా ఆట, పాటలతో ఆనందంగా గడపడమే బాలమేళా ముఖ్య ఉద్దేశమని చైల్డ్‌రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్- క్రాఫ్ సమన్వయకర్త ఎ.వెంకట్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో కేవీపీ కాలనీలోని కేఎస్‌ఆర్‌టీ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బాలమేళా పేరుతో ఆటల పోటీలు మంగళవారం నిర్వహించారు.

మేరికపూడి సచివాలయంలో చోరీ

ల్యాప్‌టాప్, కంప్యూటర్, నగదు అపహరణ


పరిశీలిస్తున్న క్లూస్‌టీం

ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడి గ్రామం చివరనున్న సచివాలయం, ఆర్బీకే కేంద్రాల భవనాల తాళాలు గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టిన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఉదయం భవనం పక్కన షెడ్డులో గేదెలకు మేతవేసేందుకు వచ్చిన రైతు గదుల తలుపులు తీసిఉండటం గమనించి కార్యదర్శి, సర్పంచులకు సమాచారం ఇచ్చాడు. భవనంలోని గదులలో బీరువాలు, ర్యాకులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. ఆర్బీకే కేంద్రంలోని కంప్యూటర్ సిస్టమ్, మరోగదిలోనున్న ల్యాప్‌టాప్, రెండుసెల్‌ఫోన్లు దొంగిలించారు. పంచాయతీ కార్యదర్శి గది సొరుగులోని తాళాలు తీసి అందులో ఉంచిన రూ.4 వేల నగదును అపహరించారు. కాగా గదుల్లోని ర్యాకులు, అలమరాలలోని పుస్తకాలు చిందరవందర చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్‌రావు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుంటూరు నుంచి క్లూస్‌టీం పోలీసులు వచ్చి సచివాలయం, ఆర్బీకే కేంద్రాల పరిసరాలను పరిశీలించారు. వేలిముద్రలు, గదులలో పడి ఉన్న పుస్తకాలు, కంప్యూటర్, ల్యాప్‌టాప్, నగదు అపహరణపై సిబ్బందిని, స్థానికంగా ఉన్న వారిని ప్రశ్నించారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజలను భయభ్రాంతులకు గురి చేయవద్దు

డివిజనల్ రైల్వే మేనేజర్‌ను అభ్యర్థించిన అఖిలపక్ష నాయకులు


విజయవాడ డీఆర్‌ఎం ఆనంద్ పాటిల్‌కు వినతి పత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి ముగ్గురోడ్డు, ఆర్‌ఎంఎస్ కాలనీ తదితర ప్రాంతాల్లో రైల్వే స్థలాల్లో నివసిస్తున్న వారిని భయభ్రాంతులకు గురి చేయవద్దని, తాడేపల్లి పట్టణ పరిధిలోని అఖిలపక్ష నాయకులు మంగళవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో డీఆర్‌ఎం ఆనంద్ పాటిల్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదుల మూడి డేవిడ్ రాజు మాట్లాడుతూ తాడేపల్లిలోని పలు ప్రాంతాల్లో రైల్వే స్థలాల్లో పేదలు గత 70–80 సంవత్సరాలుగా నివాసాలు ఏర్పరుచుకుని జీవనం సాగిస్తున్నారని, ఇటీవల రైల్వే అధికారులు ఆ స్థలాలను ఖాళీ చేయమని హెచ్చరికలు జారీ చేశారని, ఆందోళనలో వారు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారని డీఆర్‌ఎంకు వివరించడం జరిగిందని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. డీఆర్‌ఎంను కలిసిన వారిలో చిగురుపాటి బాబూరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, మేకా వెంకట రామిరెడ్డి, ముదిగొండ ప్రకాష్, తుడిమెట్ల వెంకటయ్య, దర్శనపు సామ్యూల్, తదిరతులున్నారు.

వడ్డీ వ్యాపారి టోకరా..

పెదకాకాని: వడ్డీ వ్యాపారం చేస్తున్న మహిళ పరారీ కావడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించిన సంఘటన వాసవీనగర్‌లో చోటు చేసుకుంది. పెదకాకాని మండలంలోని వాసవీనగర్ ప్రాంతానికి చెందిన పొన్నమూడి రజని కొంతకాలంగా వడ్డీ వ్యాపారం చేస్తుంది. ఇతరుల వద్ద నుంచి తక్కువ వడ్డీకి డబ్బులు తీసుకుని అధిక వడ్డీలకు ఇస్తూ వడ్డీ వ్యాపారం చేస్తుంది. నెల నెల వడ్డీలు ఇస్తూ వస్తున్న రజని కొద్దిరోజులుగా కనిపించకపోవడంతో బాధితులకు అనుమానంతో మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. సుమారు రూ.4 కోట్ల వరకు స్థానికుల వద్ద నుంచి వడ్డీకి తీసుకున్నట్లు బాధితులు ఫిర్యాదు చేశారు.

క్షణికావేశంతోనే అనర్థాలు

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి టి.లీలావతి


ఖైదీలకు ఇస్తున్న ఆహారాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి లీలావతి

తెనాలిరూరల్: క్షణికావేశంతోనే అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని, నేరాలకు పాల్పడి జీవితాలను అంధకారం చేసుకుంటున్నారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి. లీలావతి అన్నారు. తెనాలి సబ్ జైలును మంగళవారం సాయంత్రం ఆమె సందర్శించారు. ఖైదీలకు ఇస్తున్న ఆహారాన్ని, జైలు ఆవరణను, ఖైదీల బ్యారక్‌లను పరిశీలించారు. 18 నుంచి 22 ఏళ్లలోపు వయసున్న ఖైదీలను విచారించారు. మైనార్టీ తీరకుండానే నేరాలకు పాల్పడిన వారిని జువైనల్ హోమ్‌కు తరలించకుండా సబ్ జైలులోనే ఉంచారా అన్న అంశాన్ని విచారించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. గతంలో చేసిన పొరపాట్లను ఇకపై చేయకుండా ఉండేలా జైలులోనే మంచి నడవడిక అలవర్చుకోవాలని సూచించారు. అవసరమైన వారికి సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సలహా అందిస్తామని చెప్పారు. వీరి వెంట రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీసీత, న్యాయ శాఖ సిబ్బంది మహబూబ్ ఉన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


సైడ్ కాలువల నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న షేక్ అసదుల్లా

గార్లపాడు(కాకుమాను): గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గార్లపాడులో మంగళవారం మండల పరిషత్ నిధులు రూ.8 లక్షల వ్యయంతో గ్రామంలో పలు వీధులలో సైడ్‌కాలువల నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతు గత నాలుగున్నర సంవత్సరాల నుంచి మండలంలోని గ్రామాలలో మండల పరిషత్ నిధులు, ప్రభుత్వ నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో గ్రామాలలో ప్రజలకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ముజావర్ షేక్ అసదుల్లా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు ఆయా పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటివద్దకే అందించిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన తెలిపారు. ఈసందర్భంగా సైడ్ కాలువ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, వైస్ సర్పంచ్ కొమ్మాలపాటి రవికుమార్, నిడుప్రోలు సుబ్బారావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మద్యం విక్రేతలపై కేసు నమోదు

తెనాలిరూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై ఎస్‌ఈబీ అధికారులు కేసులు నమోదు చేశారు. కంచర్లపాలెం, గుడివాడ గ్రామాల్లో ఎస్‌ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇద్దరు మద్యం విక్రయిస్తుండడాన్ని గుర్తించారు. వారి నుంచి 25 సీసాలు లభించడంతో వాటిని స్వాధీనపరుచుకుని, ఇద్దరిపై కేసులు నమోదు చేశారు.

ఘనంగా పోలేరమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



గుంటూరు రూరల్: భక్తులు కోరిన కోరికలు తీర్చే దేవత పోలేరమ్మతల్లి అని వేదసీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీ ధర్మచరణ్, రాష్ట్ర దేవదాయ శాఖ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్‌లు పేర్కొన్నారు. మంగళవారం గోరంట్ల గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మతల్లి దేవస్థానం 7వ వార్షికోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కనుల పండువగా జరిగింది. కార్యక్రమంలో అతిథులు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తులసీ ధర్మచరణ్ మాట్లా డుతూ గోరంట్ల మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ పర్యవేక్షణలో ఈనెల 4వ తేదీన అమ్మవారికి పంచామృతాభిషేకంతో మొదలై, అష్టోత్తర శతనామావళి, కుంకుమార్చనతో ప్రత్యేక పూజ, అన్నదాన కార్యక్రమాలతో వేడుకలు ఘనంగా ముగిశాయని తెలిపారు. రాష్ట్ర దేవదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, తులసీ ధర్మచరణ్‌లు అమ్మవారి తీర్థ ప్రసాదం మహాన్నదానాన్ని ప్రారంభించారు. త్రిపుల్ ఎక్స్ సోప్స్ అధినేత అరుణాచలం మాణిక్యవేల్, కంచర్ల ఆంజనేయులు, యర్రంశెట్టి సూరి, డాక్టర్ కంతా జగదీష్, తాళ్ళ నాగరాజు, వేద సీడ్స్ జీఎం తోట రంగారావు, డీజీఎం దావులూరు నాగబాబు, తేలప్రోలు వెంకట్రావు, గాజుల సాయిరాం, పలు పార్టీల నాయకులు, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులకు ప్రోత్సాహకాలు అందించాలి

కొల్లిపర: గ్రామాల్లో పనులను అడిగిన కూలీలందకీ ఉపాధి కల్పించాలని ఎంపీడీవో విష్ణుప్రసాద్ ఆదేశించారు. మంగళవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా సీనియర్ మేట్‌లకు ఎలక్ట్రానిక్ మెజర్‌మెంట్ మానిటరింగ్ సిస్టంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ పనులు లేని ప్రాంతాల్లో కూలీలకు వంద శాతం పనులు కల్పించాలన్నారు. పండ్లు, పూల తోటల పెంపకానికి ముందుకొచ్చే రైతులను గుర్తించాలన్నారు. ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వారికి వివరించాలని సూచించారు. ఏపీఓ లక్ష్మీపతి, టెక్నికల్ అసిస్టెంట్ రవి, ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లు పాల్గొన్నారు.